RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -128 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 12 జూన్ 2026



# ఒమన్ తీరంలో (జల్ వీర్‌పై అమెరికా దాడి

**మూడ్రోజుల్లో మూడు నౌకలపై**

**క్షిపణులతో విధ్వంసం**

**అమెరికా దౌత్యవేత్తకు సమన్లు**

**వాణిజ్య నౌక లక్ష్యంగా జరిగిన దాడిని**

**తీవ్రంగా ఖండించిన భారత విదేశాంగ శాఖ**

**మస్కట్ : జూన్11ఆంధ్ర ప్రగతి**

ఒమన్ సమీపంలో భారత నౌక 'జల్ వీర్' పై దాడి జరిగింది. ఈ దాడిలో గల్లంతైన ముగ్గురు భారతీయులు మృతి చెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. అయితే ఒమన్ సముద్ర మార్గంలో వెళ్తున్న భారత నౌకలపై మూడు రోజుల్లో మూడు దాడులు జరగడం గమనార్హం. **మిగతా 2లో...**




# సమిష్టి కృషే కీలకం

## సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో (దేశాభివృద్ధి

**రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం మార్గదర్శకంగా ఉండాలి**

**:నితి ఆయోగ్ 11వ పాలక మండలి భేటీలో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ జూన్11ఆంధ్ర ప్రగతి**



రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, చర్చలు, ఇచ్చిపుచ్చుకోవడం మార్గదర్శకంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వికసిత్ భారత్ దార్శనికత దిశగా రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, కలిసి పనిచేయడానికి వీలు కల్పించే ఒక సహకార వేదికగా నిటి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదని తెలిపారు. గురువారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ప్రధాని అధ్యక్షతన నిటి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, ఎన్.చంద్రబాబు నాయుడుతో పాటు అన్ని రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్రమంత్రులు, **మిగతా 2లో...**

### వికసిత్ భారత్ 2047అనుగుణంగా

# స్వర్ణాంధ్ర 2047

**పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం -కొత్తగా పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ**

**విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్**

**నీతి ఆయోగ్ భేటీలో సిఎం చంద్రబాబు**




**న్యూఢిల్లీ, జూన్11ఆంధ్ర ప్రగతి**

పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని అలాగే ఏపీలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' ప్రతిష్ఠాత్మక **మిగతా 2లో...**




# విద్యా వ్యవస్థలో లోపాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు

**ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా.. పట్టించుకోని కేంద్రం**

**: ఏఐసీసీ సమావేశ నిర్ణయాలను వెల్లడించిన కెసి వేణుగోపాల్**

# రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

## : మంత్రి పొంగులేటి

**తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నట్టు పొంగులేటి వెల్లడి**

**దీని ద్వారా శిథిలావస్తలో ఉన్న భవనాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడి**



**హైదరాబాద్, జూన్11ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**

# నేటి నుంచి బడులు

**బ్యాగు, బూట్లు, యూనిఫాం ఆలస్యం**

**జులై తొలివారంలో తల్లికి వందనం**




# ఎపి మద్యం కేసులో ఇడి దూకుడు

**రాజ్‌కసిరెడ్డిఅరెస్ట్ -పలుచోట్ల ఇడి ముమ్మర సోదాలు**

**హైదరాబాద్, జూన్11ఆంధ్ర ప్రగతి**



ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దూకుడు పెంచింది. ఏపీ మద్యం స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్‌కెసిరెడ్డిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. . హైదరాబాద్ ఫిలింనగర్‌లోని నివాసంలో కారుమూరిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లిక్కర్ స్కామ్‌లో విచారణను వేగంతం చేసిన ఈడీ.. గురువారం ఉదయం హైదరాబాద్ నగరవ్యాప్తంగా పదిచోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఇందులో భాగంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేసి ఈడీ కార్యాలయానికి తరలించారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. **మిగతా 2లో...**

# డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి

**లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు.. : వైఎస్ జగన్**



**అమరావతి జూన్11ఆంధ్ర ప్రగతి**

ఏపీ మెగా డీఎస్సీ పరీక్ష, నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో విచారణ జరిపించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారు. నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీకి సంబంధించి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు**మిగతా 2లో...**

# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం..



**కూటమి ఖాతాలోకి మరో నలుగురు ఎంపీలు**

**ప్రత్యర్థి పార్టీల నుంచి రాని నామినేషన్లు**

**టీడీపీ తరపున విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ గెలుపు**

**జనసేన నుంచి లింగమనేని రమేశ్ జయకేతనం**

**అమరావతి :జూన్11ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ కోటాలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవం అయింది. కూటమిలో భాగంగా తెలుగుదేశం పార్టీ నుంచి ముగ్గురు,**మిగతా 2లో...**



# కేంద్రం సహకరించాలి

**ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ జూన్11ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ ప్రధాని నరేంద్ర మోడీతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. **మిగతా 2లో...**

# సమిష్టి కృషే కీలకం

**మొదటిపేజీ తరువాయి**

నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్, సభ్యులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పాల్గొన్నారు. '2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం అందరికీ సమ్మిళిత అభివృద్ధి ఫలాలు'ను ఈ సంవత్సరం ఇతివృత్తంగా ఎంపిక చేశారు.

దేశంలో ప్రతి ఒక్కరికీ నిర్దిష్ట, గణనీయమైన ఫలితాలను అందించడానికి అవలంభించాల్సిన విధానంపై పాలక మండలి సమావేశంలో చర్చించారు. అలాగే సమ్మిళిత మానవాభివృద్ధి ప్రాథమిక ప్రణాళిక పైనా చర్చలు జరిపారు. '

'1. మూలాధార మానవ పెట్టుబడి, రాబోయే కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సన్నద్ధంగా ఉండే నైపుణ్యాలు. 2. ఉత్పాదక ఉపాధికల్పన, ఔత్సాహిక పారిశ్రామికత్వం, వికేంద్రీకరించిన అభివృద్ధి. 3. ఆరోగ్యం, పోషణ, సంక్షేమం. 4. అందరికీ సమాన అవకాశాలు, ఆత్మగౌరవం" వంటి నాలుగు ముఖ్యాంశాల ఆధారంగా చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఔత్సాహిక పారిశ్రామికత్వాన్ని, నైపుణ్యాల సాధనను ప్రోత్సహించడంతో పాటు దీర్ఘకాలం పాటు మనుగడలో ఉండే ఉద్యోగావకాశాలను కల్పించడానికి ఏయే చర్యలు తీసుకోవాలన్నదాని గురించి కూడా చర్చించారు. పాలన, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), భాగస్వామ్యాలు, డేటా ఆధారిత వ్యవస్థలు సహా ప్రధాన సహాయకారి అంశాలను వినియోగించుకుంటూ ఒక కార్యాచరణ నమూనాను రూపొందించడంపై దృష్టి సారించారు. సమ్మిళిత మానవ అభివృద్ధిపై జాతీయ దృష్టికోణానికి, రాష్ట్రాల దృష్టికోణాలకు మధ్య పొందికను సమకూర్చడంపై చర్చలు జరిపారు. ఫలితంగా సమాన, దీర్ఘకాలిక అభివృద్ధి దిశగా ఏకీకృత, సహకార ప్రధాన విధానాన్ని అమలు చేయడానికి మార్గం సుగమం అవుతుందని చర్చల్లో వివరించారు.

నిటి ఆయోగ్ పాలక మండలి 2025 డిసెంబరు 26 నుంచి 28 మధ్య నిర్వహించిన ముఖ్య కార్యదర్శుల 5వ జాతీయ సమావేశం సిఫారసులు "1. బాల్యంలో ముందస్తు విద్యాబోధన: పునాదిని వేయడం. 2. పాఠశాల విద్యాబోధన: మూలాధారంగా నిలిచే నిర్మాణం. 3. నైపుణ్యాలను నేర్పించడం: భవిష్యత్తు అవసరాల కోసం సన్నద్ధులై ఉండే శ్రమ శక్తి. 4. ఉన్నత విద్యాబోధన: జ్ఞానాధారిత ఆర్థికవ్యవస్థను ఏర్పాటు చేయడం. 5. క్రీడలు, పాఠ్యాంశేతర కార్యకలాపాలు: తరగతి గదులకు ఆవల సన్నాహక చర్యలు"పై కూడా ఈ సమావేశంలో చర్చించారు.

**సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో దేశ అభివృద్ధి : మోడీ**

ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడు తూ.. అభివృద్ధి చెందిన దేశం అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేసుకోవడంలో కేంద్ర, రాష్ట్రాల సమిష్టి కృషి కీలక పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. ప్రపంచం ప్రస్తుతం అనిశ్చితి, అస్థిరతతో కూడిన కాలం గుండా వెళ్తున్నప్పటికీ.. భారత్ ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో తన వృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, దేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మనం కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. వృద్ధి, ఎగుమతులకు కొత్త అవకాశాలను సృష్టించేం దుకు భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసిందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ఒప్పందాలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఒక ముఖ్యమైన అవకాశాన్ని అందిస్తున్నాయని తెలిపారు. దేశ జనాభా డివిడెండ్‌ను దేశం కోల్పోలేని ఒక చారిత్రాత్మక అవకాశంగా ప్రధాని మోడీ అభివర్ణించారు. నాణ్య మైన విద్య, డిమాండ్‌కు అనుగుణమైన నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలతో యువత కోసం సరైన వ్యవస్థను సృష్టించాలని ఆయన పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ దార్శనికతకు మహిళా నేతృత్వంలోని అభివృద్ధి ఒక మూలస్తంభమని గుర్తించారు. వ్యవసాయం, స్టార్టప్‌ల నుంచి సైన్స్, ఆవిష్కరణల వరకు నారీ శక్తి వివిధ రంగాలలో తన వంతు కృషి చేస్తోందని చెప్పారు.

# డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి: వైఎస్ జగన్

**మొదటిపేజీ తరువాయి**

అత్యంత దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాలతో లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేసిందని, ప్రతిభావంతులైన నిరుద్యోగుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీసిందని జగన్ ఆరోపించారు. ఇంతటి దారుణమైన నియామక ప్రక్రియను ఎక్కడా చూడలేదని అన్నారు. "అబద్ధాలు, మోసం, దగా, వెన్నుపోటు, కుంభకోణాలకు చొక్కా, ప్యాంటు వేస్తే అది చంద్రబాబు అవుతారు" అని ఆయన విమర్శించారు. లక్షలాది మంది యువత ఆశలు, భవిష్యత్తు ముడిపడి ఉన్న డీఎస్సీ వంటి ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు.

**'మేమూ బొద్దింకలమే.. జనరేషన్ జెడ్ చూస్తోంది'**

ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను జనరేషన్ జెడ్ (+వఅ ) గమనిస్తోందని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "చంద్రబాబూ గుర్తుంచుకో, ఇది జెన్ జెడ్. జెన్ ఆల్ఫా కూడా వస్తోంది. తప్పులు ఒప్పుకోకుండా ఇబ్బంది పెడితే బొద్దింకలు తిరగబడతాయి" అని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ తర్వాత ఆన్‌లైన్‌లో మొదలైన 'జనతా కాక్రోచ్ పార్టీ' ఉద్యమం గురించి ప్రస్తావించగా, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మేం కూడా బొద్దింకలమే. యువతకు అన్యాయం జరిగితే వారు ఇలాంటి మార్గాలనే ఎంచుకుంటారు" అని జగన్ పేర్కొన్నారు.

**అక్రమాలపై జగన్ వివరణ**

డీఎస్సీ అక్రమాలపై జగన్ వివరంగా మాట్లాడుతూ.. 1995 నుంచి చంద్రబాబు పాలన లీకులు, అవినీతితోనే నిండిపోయిందన్నారు. ఈసారి డీఎస్సీ కన్వీనర్‌ను పక్కనపెట్టి, ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారని, ఒకే అధికారి చేతిలో కీలక అధికారాలు కేంద్రీకరించి పారదర్శకతను దెబ్బతీశారని ఆరోపించారు. ప్రశ్నపత్రం ఎంతమంది చేతుల్లోకి వెళ్లింది, ఎంత డబ్బు చేతులు మారింది అనే విషయాలు థర్డ్ పార్టీ ఏజెన్సీ విచారణలోనే తేలుతాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ జగన్ ధ్వజమెత్తారు. "స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు అర్హత పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఉంటే చాలని జీవోలు ఇచ్చి తమకు కావాల్సిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన కాలేజీ, యూనివర్సిటీ, జిల్లా స్థాయి పోటీల పార్టిసిపేషన్ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు ఇచ్చారు. మరోవైపు, జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి ఇంటర్వ్యూలకు పిలిపించిన నిజమైన అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. మొత్తం 270 మంది అర్హత పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు" అని జగన్ వివరించారు.

**సీబీఐ విచారణే శరణ్యం**

తమ హయాంలో నోటిఫికేషన్ నుంచి నియామక పత్రాలు ఇచ్చే వరకు కేవలం నాలుగు నెలల్లో 1.30 లక్షల ఉద్యోగాలను ఎలాంటి లోపాలు లేకుండా భర్తీ చేశామని జగన్ గుర్తుచేశారు. డీఎస్సీ వ్యవహారంలో చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన కుమారుడు లోకేశ్ ముద్దాయిలని, వారే తీర్పు చెబితే న్యాయం జరగదని, అందుకే సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. జూన్ 12న తలపెట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంలో ఈ డీఎస్సీ అక్రమాల అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు

# కేంద్రం సహకరించాలి

**మొదటిపేజీ తరువాయి**

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్2లో ఏడు కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. ట్రిపుల్ ఆర్ పనులకు ఆమోదం తెలపండి

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్అమరావతిబందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు.

120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనుల గురించి ప్రస్తావన వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం-2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

# విద్యా వ్యవస్థలో లోపాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు

## ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా.. పట్టించుకోని కేంద్రం

### : ఏఐసీసీ సమావేశ నిర్ణయాలను వెల్లడించిన కెసి వేణుగోపాల్



**న్యూఢిల్లీ జూన్11ఆంధ్ర ప్రగతి**

దేశ సమస్యలు, విద్యావ్యవస్థలో లోపాలపై రానున్న రెండు, మూడు నెలలపాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు, ప్రచారాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఉన్న సమస్యలకు ప్రధాని మోడీ వెంటనే సమాధానం చెప్పాలని అన్నారు. మోడీ సర్కారు పాలనలో ప్రజలు, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని ఆరోపించారు. గురువారం నాడిక్కడ ఇందిరా భవన్‌లో అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత ఏఐసీసీ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై కాంగ్రెస్ అగ్రనేతలు చర్చించారు. మూడు గంటల పాటు సుదీర్ఘంగా ఈ భేటీ కొనసాగింది. ఈ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెసి వేణుగోపాల్ వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్త ఆందోళనలు, ప్రచారాలకు సంబంధించి మూడు, నాలుగు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లో పరిస్థితులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని విమర్శిం చారు. కోర్టు నోటీసు ఆధారంగా చేసుకుని ఎఫ్ఐఆర్ లేకపోయినా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జార్ఖండ్‌లో బీజేపీ అభ్యర్థి నామినేషన్ పత్రాలు సరిగ్గా నింపకపోయినా ఆ నామినేషన్ అంగీకరించారని గుర్తు చేశారు.

## వికసిత్ భారత్ 2047అనుగుణంగా

# స్వర్ణాంధ్ర 2047

**మొదటిపేజీ తరువాయి**

విజన్ ప్లాన్‌ను సమర్పించారు. పేదరిక నిర్మూలన, భారీస్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్ ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో ఏపీ పారదర్శక విధానాల వల్ల రూ. 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులని ఆకర్షించామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'అవేర్' వంటి ప్రిడిక్టివ్ టూల్స్‌తో ఏపీలో సాంకేతిక పాలన కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య అనారోగ్యకర పోటీ వద్దని సూచించారు. మౌలిక వసతులు, స్థిరమైన విధానాలపై దృష్టి పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో నివారణ ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసేలా ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తున్నట్లు వివరించారు. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.5శాతం కంటే తగ్గడంపై సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత, వృద్ధాప్య సమస్యలను అధిగమించేందుకు ఏపీలో కొత్త 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకువస్తామని వివరించారు. వికసిత్ భారత్ 2047 సాధన కోసం కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఎపి మద్యం కేసులో ఇడి దూకుడు

**మొదటిపేజీ తరువాయి**

ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కెసిరెడ్డి ఇళ్లతోపాటు మరో ఆరుగురి నిందితుల ఇళ్లలో గురువారం ఉదయం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఆయన బంధువు నరసింహారెడ్డి ఇల్లు, కార్యాలయాల్లోనూ దాడులు కొనసాగుతున్నాయి. ఏపీ మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. హవాలా, మనీలాండరింగ్ ద్వారా నిధులు తరలించినట్లు ఈడీ గుర్తించింది. ఈ క్రమంలో నానక్‌రామ్‌గూడలోని నివాసంలో రాజ్‌కెసిరెడ్డిని ఈడీ అరెస్ట్ చేసింది. ఏపీలోని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇల్లు, కార్యాలయంలోనూ సోదాలు కొనసాగాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ప్రాథమిక విచారణ జరిపిన ఈడీ అధికారులు.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద అభియోగాలు మోపి, తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసులో 33 మందిని నిందితులుగా చేర్చారు. వైకాపా ప్రభుత్వ పెద్దల తరపున మద్యం కుంభకోణంలో అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డితో పాటు వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సీఎంవో కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలతో పాటు ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ పూర్వపు డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి, మద్యం ముడుపుల వసూళ్లలో కీలకంగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి, వీరి అనుచరులు బూనేటి చాణక్య, టి.కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్‌తో పాటు మద్యం ముడుపుల సొత్తు రూటింగ్ కోసం వినియోగించిన పలు డొల్ల సంస్థల యాజమాన్యాలను నిందితులుగా ఈడీ చేర్చింది. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద మద్యం కుంభకోణం కావటంతో పాటు సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి వసూలు చేసిన దాదాపు రూ.3,200 కోట్ల ముడుపులను కల్పిత, ఊహాజనిత కంపెనీల ద్వారా వివిధ దశల్లో రూటింగ్ చేసి అంతిమ లబ్దిదారుకు చేర్చినట్లు ప్రాథమికంగా గుర్తించిన ఈడీ.. దర్యాప్తులో మూలాలను వెలికితీస్తోంది.

# నేటి నుంచి బడులు

**అమరావతి జూన్11ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 24 నుంచి బడులకు వేసవి సెలవులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రతియేటా బడులు ప్రారంభమయ్యే నాటికి సిద్ధమవుతుండగా, ఇప్పటి వరకు రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయకపోవడం గమనార్హం. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలో యూనిఫాం, బ్యాగు, బూట్లు అందించడం లేదు. పశ్చిమ దేశాల్లో నెలకొన్న యుద్ధం కారణంగా నెలరోజులు ఆలస్యంగా అందిస్తామని సమగ్రశిక్ష ఇప్పటికే వెల్లడించింది. కిట్‌లోని పాఠ్యాంశ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ వంటివి అందిస్తామని వెల్లడించింది. మెగా పిటిఎం నాటికి మిగిలిన వస్తువులను అందిస్తామని చెప్పింది. గతేడాది పాఠశాలలు ప్రారంభం రోజునే అమలు చేసిన తల్లికి వందనం కూడా ఈ ఏడాది ఆలస్యం కానుంది. ఈ పథకం అమలు చేసేందుకు నిధుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. అవసరమైన నిధులను ఆర్థికశాఖ సమీకరించు కుంటోందని అంటున్నారు. జులై తొలివారంలో తల్లుల ఖాతాల్లో ఈ పథకం నిధులను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం..

**మొదటిపేజీ తరువాయి**

జనసేన పార్టీ నుంచి ఒకరిని ఆయా పార్టీల అధిష్ఠానాలు బరిలోకి దించాయి.

టీడీపీ అభ్యర్థులుగా చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ నామినేషన్లు దాఖలు చేయగా, జనసేన తరఫున లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎలాంటి నామినేషన్లు రాకపోగా, ఉపసంహరణ గడువు కూడా ఇవాల్టితో ముగియడంతో ఈ నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ధృవీకరించారు.

# ఒమన్ తీరంలో జల్ వీర్‌పై అమెరికా దాడి

**మొదటిపేజీ తరువాయి**

ఓ వైపు భారత నౌకలపై ఎలాంటి ఆంక్షలు లేవని ఇరాన్ అంటుంటే.. మరోపక్క భారత్ హార్ముజ్ మార్గంలో కాకుండా ఒమన్ సముద్ర తీరం నుంచి రాకపోకలు సాగిస్తోంది. అయితే భారత్ ను ఇరకాటంలో పెట్టడమే కాదు. ఇరాన్ పై బురదజల్లేలా అమెరికా దుష్ట పన్నాగం చేస్తుందన్న వాస్తవాన్ని ఎట్టకేలకు భారత్ గుర్తించింది. ఒమన్ తీరంలో వాణిజ్య నౌక 'జల్ వీర్'పై దాడి జరిగిన సమయంలో ఓడలో మొత్తం 28 మంది ప్రయాణిస్తుండగా, వారిలో 24 మంది భారతీయులు ఉన్నారు. ఈ దాడి తర్వాత ముగ్గురు భారతీయులు గల్లంతైనట్టు సమాచారం. కాగా మరో 21 మంది సురక్షితంగా ఉన్నట్టు ప్రకటించింది. అయితే గల్లంతైన ఆ ముగ్గురూ అమెరికా జరిపిన వైమానిక దాడిలో చనిపోయినట్టు నిర్ధారణ అయ్యింది. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగానే ఇది జరిగి ఉండవచ్చని బ్రిటిష్ సముద్ర భద్రతా సంస్థ ఎంబ్రాయర్ చెప్పినట్లు రాయిటర్స్ పేర్కొంది. దాడి జరిగితే ఓడ వెనుక భాగంలో కాకుండా, ముందు భాగంలో గుమిగూడాలని సిబ్బందిని గతంలోనే హెచ్చరించినట్టు తెలిపింది.

## రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి

**మొదటిపేజీ తరువాయి**

తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు.

గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# అంతర్జాతీయ యోగ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్స్ త్వరగా పూర్తి చేయాలి.

**..ఆర్టీసీ బస్ స్టాండ్ మరియు బస్సుల ద్వారా యోగా పై విస్తృతంగా ప్రచారం, రిజిస్ట్రేషన్ జరగాలి. -జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 11:** అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున యోగా చేసే సభ్యుల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ యోగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... కర్నూలు జిల్లా కలెక్టర్ నిర్దేశించిన ప్రకారం 4 లక్షల 62 వేల మంది యోగా చేసేవారు లక్ష్యంగా ఉన్నారని , ఆ సంఖ్యకు అధికంగా రిజిస్ట్రేషన్స్ జరగాలని వారందరూ జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున యోగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యోగ కార్యక్రమం పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహిస్తున్నందున అంత లోపల ప్రజలు క్యూఆర్ కోడ్ ని వినియోగించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకొని యోగాలో పాల్గొనే వారి సంఖ్యను పెంచే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో జూన్ 12న పాఠశాలలు మొదలవుతాయని కావున పాఠశాలల విద్యార్థులు , అలాగే కాలేజీ విద్యార్థులను అధిక సంఖ్యలో క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేయించి వారందరూ యోగా కార్యక్రమంలో పాల్గొనే చర్యలు తీసుకోవాలని డీఈవో , ఆర్ఐఓ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సమావేశమునకు హాజరైన సంబంధిత అధికారులందరిని వారికి ఇచ్చిన లక్ష్యం ప్రకారం రిజిస్ట్రేషన్లు ఎంతవరకు చేశారు అన్న వివరాలు రాబట్టి వెంటనే రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేసి లక్ష్యం చేరుకోవాలని ఆదేశించారు. జిల్లాలో యోగ కార్యక్రమం పై ఆర్టీసీ ద్వారా విస్తృతంగా ప్రచారం , క్యూఆర్ కోడ్ అవగాహన ద్వారా విస్తృతంగా రిజిస్ట్రేషన్లు జరగాలని ఆదేశించారు.ప్రజలు యోగాలో పాల్గొనే దానికి గాను అన్ని ఆర్ టి సి బస్టాండ్లలో క్యూఆర్ కోడ్ తో ఉన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని , అలాగే ఆర్టీసీ బస్సు లోపల బయట క్యూఆర్ కోడ్ అగుపడే విధంగా పోస్టర్లు అంటించే ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశానికి సీఈవో సెట్కూర్ వేణుగోపాల్ , జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి , డిప్యూటీ డిఎంహెచ్ఓ భాస్కర్ , ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు , ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు , డిఆర్డిఏ పిడి రమణారెడ్డి , టూరిజం జోనల్ అధికారి లక్ష్మీనారాయణ , డి ఎస్ డి ఓ భూపతి , మెప్మా పీడీ శ్రీనివాసులు , డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి , ఆర్ ఐ ఓ , డి ఈ ఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన మహిళా హోంగార్డుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం.

**..సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ శ్రీ మహేష్ కుమార్.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా క్రైమ్ జూన్ 11:** కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సదరన్ రీజియన్ హోం గార్డ్స్ కమాండెంట్ శ్రీ ఎం. మహేష్ కుమార్ కర్నూలు యూనిట్‌కు చెందిన మహిళా హోంగార్డు శ్రీమతి డి. ఆంతోనమ్మ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా గురువారం హోంగార్డ్స్ డిస్ట్రిక్ట్ కాంట్రిబ్యూషన్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 2 లక్షల ఆర్థిక సహాయ చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలోని హోంగార్డు కమాండ్ కార్యాలయంలో అందజేశారు. హోంగార్డుల సంక్షేమానికి ప్రభుత్వం మరియు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని హోంగార్డు కమాండెంట్ శ్రీ మహేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ శ్రీ ప్రసాద్ , హోంగార్డ్సు ఆర్ ఐ పోతల రాజు , ఏఆర్ఎస్ఐలు కాంతారెడ్డి , శ్రీ ఎం. మహేశ్వరయ్య , ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ దానమయ్య , పోలీసు సిబ్బంది మరియు హోంగార్డులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలి.

**..స్వర్ణ వార్డు కార్యాలయాల ఆకస్మిక తనిఖీ, రికార్డుల నిర్వహణ, ప్రజా సేవలపై సమీక్ష. -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు/గూడూరు జూన్ 11:** ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని స్వర్ణ వార్డు కార్యాల సిబ్బందికి జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

గురువారం గూడూరు మండల కేంద్రంలోని 4వ మరియు 6వ స్వర్ణ వార్డు కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందిస్తున్న సేవలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్... నవచేతన యాప్ ద్వారా నిర్వహిస్తున్న ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్ కార్యక్రమం అమలు 06 సంవత్సరాల వయస్సు గల చిన్నారులలో ఆరోగ్య మరియు అభివృద్ధి లోపాల గుర్తింపు, అండర్ వెయిట్ పిల్లల వివరాలు, గర్భిణీల నమోదు, రక్తపోటు మరియు మధుమేహ పరీక్షలు, యోగాంధ్ర నమోదు ప్రక్రియ, గృహ నిర్మాణాల పురోగతి, ఈ-కేవైసీ నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందిని ప్రశ్నించి సమగ్ర సమాచారం సేకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు అత్యంత చేరువలో ఉండే స్వర్ణ వార్డు కార్యాలయాలు ప్రభుత్వ సేవల అందజేతలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వెంటనే స్పందించి సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా మహిళా పోలీసు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. "గుడ్ టచ్ బ్యాడ్ టచ్" అవగాహన కార్యక్రమాల ద్వారా ఎంతమందికి అవగాహన కల్పించారో, వార్డు పరిధిలో ఉన్న టీనేజ్ బాలికల సంఖ్య ఎంత, వారికి సంబంధించిన రికార్డులు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నిస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. టీనేజ్ బాలికలకు సంబంధించిన సమగ్ర రికార్డులను తప్పనిసరిగా నిర్వహించి, వారి విద్య, ఆరోగ్యం, భద్రత అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

బాల్య వివాహాల నివారణలో ఈ రికార్డులు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్న కలెక్టర్, గ్రామ మరియు వార్డు స్థాయిలో ఉన్న సిబ్బంది ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాలికల సంక్షేమం, భద్రత మరియు వారి భవిష్యత్తు అభివృద్ధి కోసం ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.

అదేవిధంగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులకు ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్, చిన్నారుల ఆరోగ్య మరియు అభివృద్ధి లోపాల గుర్తింపు, బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, వార్డు స్థాయిలో పనిచేసే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే చిన్నారులు, బాలికల సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ప్రత్యేక అధికారి భాస్కర్ నాయుడు, తహశీల్దార్ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతుల్లోనే చెత్త నిర్వహణ చేపట్టాలి.

**వర్మి కంపోస్టు తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. -జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**కర్నూలు/గూడూరుఆంధ్ర ప్రగతి జూన్ 11:** శాస్త్రీయ పద్ధతుల్లోనే చెత్త నిర్వహణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.గురువారం గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం యూనిట్ ను పరిశీలిస్తూ, కేవలం పేడను తీసుకొచ్చి వేయడం వర్మి కంపోస్టు తయారీ కాదని కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి పని తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు.. శాస్త్రీయ విధానాలను అనుసరించి వర్మి కంపోస్టు తయారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో వేరు చేసి, సక్రమంగా నిర్వహించడం ద్వారా మాత్రమే మెరుగైన పారిశుధ్య ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీలో నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సంబంధిత వారిని ఆదేశించారు. శాస్త్రీయ పద్ధతుల్లో వర్మి కంపోస్టు తయారీ పై అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు. జూలై మొదటి నాటికి అన్ని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలలో శాస్త్రీయ పద్ధతుల్లో వర్మి కంపోస్టు తయారీ కనపడకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డి పి ఓ భాస్కర్, గూడూరు తహసిల్దార్ వెంకటేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

## - రైతుకు అధిక దిగుబడి సాధ్యం.

**..ప్రకృతి వ్యవసాయానికి పశుసంపదే పునాది. -జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు/గూడూరు జూన్ 11:** ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతమై రైతులకు అధిక దిగుబడి లభిస్తుందని, వ్యవసాయ రంగంలో తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యత కలిగిన దిగుబడులు సాధించడానికి సేంద్రియ వ్యవసాయం ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.

గురువారం గూడూరు మండల కేంద్రానికి చెందిన రైతులు శేఖర్, రామకృష్ణ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాలను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడటం వల్ల రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని, దీనికి ప్రత్యామ్నాయంగా పశుసంపద ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. ప్రకృతిలోని సమతుల్యతను కాపాడడంలో పశువుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రైతులు యూరియా వంటి రసాయన ఎరువుల కోసం ప్రతి సీజన్‌లో భారీగా ఖర్చు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా కూరగాయల సాగులో అధిక మొత్తంలో యూరియాను వినియోగిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు తమ వద్ద రెండు మేకలు, కొన్ని గొర్రెలు లేదా ఒక ఆవును పెంచుకున్నా, వాటి ద్వారా లభించే పేడ సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు.. పశువుల పేడలో నైట్రోజన్, కార్బన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉండటంతో నేల సారవంతం అవుతుందని, పంటల పెరుగుదలకు ఇది దోహదపడుతుందన్నారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించలేకపోయినా, కనీసం పశుసంపదను పెంచి వాటి పేడను వినియోగించాలని కలెక్టర్ రైతులకు సూచించారు.ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు శేఖర్ తన పొలాన్ని సందర్శించిన కలెక్టర్ కి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధిస్తున్న ఫలితాలను వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా గోరుచిక్కుడు ప్రధాన పంటతో పాటు పుంటికూర (గోంగూర), మెంతికూర, కొత్తిమీర, బెండకాయ తదితర అంతర పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం రూ.4 వేల పెట్టుబడితో సాగు ప్రారంభించగా, మెంతికూర మరియు కొత్తిమీర విక్రయాల ద్వారానే ఆ పెట్టుబడి తిరిగి వచ్చిందని, మిగతా పంటల ద్వారా అదనపు ఆదాయం లభిస్తోందని చెప్పారు. గోరుచిక్కుడు పంట 60 రోజుల్లోనే మొదటి కోతకు వచ్చి, వరుసగా ఏడు నుంచి ఎనిమిది కోతల ద్వారా ఖర్చులు మినహాయించి రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ కు వివరించారు. అదే విధంగా ఘన జీవామృతం, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వివిధ జీవ పదార్థాలను స్వయంగా తయారు చేసుకుని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుని కనీసం మరో 20 మంది రైతులను ఈ విధానంలోకి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పశుసంపద ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూసారాన్ని కాపాడటంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం రైతు రామకృష్ణ సాగు చేస్తున్న పొలాన్ని పరిశీలిస్తూ, అక్కడ అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు చేసిన పెట్టుబడి, నీటి వినియోగ సామర్థ్యం, ప్రకృతి వ్యవసాయం ద్వారా లభిస్తున్న ప్రయోజనాలపై రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను సేకరించి వాటిని ఇతర రైతులకు చేరవేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుల విజయగాథలను గ్రామ స్థాయిలో ప్రచారం చేసి ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు.

**రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలి.**

గూడూరు మండల కేంద్రంలోని మన గ్రోమోర్ యూరియా షాపు ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలన్నారు. ఏపీ ఐఎంఎస్ యాప్ ద్వారా రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేసి యూరియా సరఫరా చేస్తున్నారనే ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నిన్న, మొన్న ఎన్ని బ్యాగ్ ల యూరియా సరఫరా చేశారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. యాప్ లో ఈరోజు టెక్నికల్ సమస్య ఉన్నందున రైతుల వివరాలు నమోదు అవ్వడం లేదని డీలర్లు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా,యాప్ టెక్నికల్ ఇష్యూ గురించి ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందని సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, గూడూరు తహశీల్దార్ వెంకటేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# యోగా నిర్వహణకు యోగా అసోసియేషన్లు సమన్వయంతో పనిచేయాలి.

**..యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం - ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి.**

**..అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 11:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించనున్న యోగా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, యోగా అసోసియేషన్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో యోగ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై యోగా ప్రచార కార్యక్రమాలు, ప్రజల్లో యోగాపై అవగాహన పెంపు చర్యలు, నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 7 నుండి 21 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక యోగా కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొని విశేష స్పందన చూపారని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాలకు ప్రత్యేక థీమ్‌లను కేటాయించగా, నంద్యాల జిల్లాకు యోగా అసోసియేషన్ల భాగస్వామ్యంతో ఈనెల 17వ తేదీ కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా సూచించియున్నారని కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం, మహానంది వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యోగా ప్రాముఖ్యతను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు మహానంది దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు సుమారు 1,500 మంది పాల్గొనే యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జూన్ 17న నంద్యాల పట్టణంలో సుమారు 5,000 మంది పాల్గొనే భారీ యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. యోగా కార్యక్రమాల నిర్వహణకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ వెలుపల ఉన్న ప్రాంగణాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పాల్గొనే వారికి అనుకూలంగా డయాస్ ఏర్పాటు, గ్రీన్ కార్పెట్, తాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రతిరోజూ ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. చిన్న రాళ్లు, వ్యర్థాలను తొలగించి గ్రీన్ మ్యాట్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ డిఎస్డిఓను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ, శానిటేషన్ లేదా ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు హౌస్‌కీపింగ్ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు 'పురమిత్ర' మొబైల్ యాప్‌లను వినియోగించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, పన్నులు, పౌర సేవలు తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ యాప్‌ల ద్వారా నమోదు చేస్తే 24 గంటల్లోపు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా 'పురమిత్ర' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులభంగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. అదేవిధంగా, పాఠశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రజా ప్రదేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ప్లాస్టిక్ రహిత నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఆయుష్ కోఆర్డినేటర్ డా. యశోధర, డిఎస్డిఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 11:**నంద్యాల టౌన్ 32వ వార్డు పరిధిలోని ఊడుమాల్పురంలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ ధనుజయ్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ లబ్ధిదారులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు భూమిపై పూర్తి హక్కులను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, పారదర్శకమైన విధానంలో ఈ పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ పట్టాదారు పాస్ పుస్తకాల ద్వారా రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సులభంగా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, ఎమ్మార్వో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శేషన్న, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి , 32వ వార్డు ఊడుమాల్పురం టిడిపి ఇంచార్జి కళ్యాణ్, జ్వాలా తిరుమలేష్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవ వధువులకు పెళ్లి కానుక పంపిణీ.

**-కీ.శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం నవ వధువులకు పెళ్లి కానుక**

**-2022 లో ప్రారంభమైన పెళ్లి కానుక పంపిణీ - ప్రతియేటా వందల మందికి పెళ్లి కానుకలు అందజేత**

**- కుల మతాలకు అతీతంగా అందరికీ పెళ్లి కానుక : బిసి రాజారెడ్డి**

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జూన్ 11:**



బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన నవ వధువుల కోసం ఉచితంగా పెళ్లి కానుక పంపిణీ చేస్తున్నట్లు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి చెందిన ముల్లా రసూల్, షాహిదాబి దంపతుల కుమార్తె, బనగానపల్లె పట్టణానికి చెందిన పొగబుడ్డి ఆరిఫ్ భాష, గౌసియాబి దంపతుల కుమార్తెల వివాహం సందర్భంగా వారికి పెళ్లి కానుకలను అందజేశారు. ఈసందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... తన తల్లిదండ్రులు కీ.శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వివాహం చేసుకోబోయే నూతన వధువులకు ఉచితంగా పెళ్లి కానుక అందజేయడం జరుగుతుందన్నారు. 2022 నుంచి ఈ పెళ్లి కానుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతి ఏటా వందల మంది నవ వధువులకు పెళ్లి కానుకలు అందజేస్తున్నామన్నారు. పెళ్లి కానుకలో రూ.4 వేలు విలువ చేసే ప్రముఖ రెమాండ్ కంపెనీకి చెందిన పెండ్లి కుమార్తెకు చీర, పెళ్లి కుమారుడికి సర్ట్, పాయింటు ఉంటాయన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఈ పెళ్లి కానుక అందజేస్తున్నట్లు బిసి రాజారెడ్డి తెలిపారు. వధువు తరపున పెళ్లి కార్డు తీసుకొని వచ్చి తనను సంప్రదిస్తే వారికి పెళ్ళికానుకను అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల , సంజామల, కొలిమిగుండ్ల , అవుకు మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిసి రాజా రెడ్డి గారు కోరారు.

## డేనియల్ పురంలో "వీఐపీ పవర్ హౌస్ జిమ్ సెంటర్ ప్రారంభం. -మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 11:**నంద్యాల పట్టణంలో సరికొత్త హెల్త్ అండ్ ఫిట్నెస్ హబ్ అందుబాటులోకి వచ్చింది. డేనియల్ పురం లో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన "వీఐపీ పవర్ హౌస్ జిమ్ సెంటర్"ను నేడు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్ నిర్వాహకుడు జీవాను ఆయనప్రత్యేకంగా అభినందించారు. నంద్యాల యువతకు ఫిటెనెస్ పై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు ఇక్కడ పర్సనల్ ఫిట్నెస్ ట్రైనింగ్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కేవలం వర్కవుట్స్ మాత్రమే కాకుండా.. డైట్, న్యూట్రీషియన్ ఫుడ్ అంశాలపై కూడా నిపుణులతో ప్రత్యేక గైడెన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ వీఐపీ పవర్ హౌస్ జిమ్ సెంటర్ ద్వారా నంద్యాల యువత తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ఫిట్ గా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ శ్రీశైలం నియోజకవర్గం పరిశీలకుడు పీపీ మధు సూధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వరరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, దేవ, అరుణ్, రవి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పీఎండీఎస్ కిట్లలోని విత్తనాలు పొలాల్లో చల్లుకునే కార్యక్రమం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 11:**



నంద్యాల మండలములోని అయ్యలూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తో కలిసి పి. యం.డి. యస్ కిట్ నందు గల 25 రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను పొలంలో విత్తుకునే కార్యక్రమం లో పాల్గొనటం జరిగినది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ కాలంలో ఇల్లినో ప్రభావంను అధిగమించడానికి పి. యం.డి.యస్ కిట్లలోని విత్తనాలను పొలంలో వెదజల్లోకోవడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అందువలన రైతులు తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలాల్లో ఈ కిట్లను విత్తుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి నంద్యాల ప్రసాదరావు మాట్లాడుతూ పి. యం.డి.ఎస్ కిట్ విత్తుకోవటం వలన భూమి నిరంతరం పచ్చదనంతో కప్పబడి , తదుపరి సాగు చేసే పంటలకు సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుందని, అలాగే భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెందుతుందని, భూమి నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందని అలాగే మొక్కలకు అవసరమైన అన్ని పోషకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ఖరీఫ్ కాలంలో రాబోవు ఎల్నినో ప్రభావాన్ని పంటలు తట్టుకోగలవని, కావున రైతులు తప్పనిసరిగా ఈ పద్ధతిని ఆచరించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రభావతి, భాష మరియు రైతులు పాల్గొనటం జరిగినది.

## వైభవంగా శ్రీ బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానం

# నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం.

**..ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 11:**నంద్యాల కోటవీధిలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానానికి నూతనంగా నియమితులైన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై, దేవస్థానం నూతన ధర్మకర్తలకు బాధ్యతలను స్వీకరించేలా ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవస్థానం చైర్మన్‌గా శ్రీ బోయ రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు పాలక మండలి సభ్యులు మురలీకృష్ణ శర్మ , రాధాకృష్ణ శర్మ , మోహన్ గుప్తా, వెంకటసుబ్బయ్య , రామ పుల్లయ్య, శిరీష, మాధవి, అనంతలక్ష్మి , రమణమ్మ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీ బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారికి దేవస్థానం కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని, భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో ధర్మకర్తల మండలి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. దైవకార్యాలలో నిమగ్నమై, దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పరంగా దేవాలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దేవస్థానం చైర్మన్ బోయ రామకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మంత్రి ఫరూక్ కి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దడానికి, దేవాలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పాలక మండలి సభ్యులందరి సహకారంతో దేవస్థానాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఈ కార్యక్రమంలో రామచంద్రరావు , ఎన్ఎండి ఫిరోజ్, మునియా ఖలీల్ , సురేష్, ఇలియాస్, మురలీధర్, భరద్వాజ శర్మ , శ్యామ్ సుందర్ లాల్, నాగార్జున, చలం బాబు, రాజారాం, పసుపులేటి నారాయణ, శ్యాంసుందర్ గుప్తా మరియు స్థానిక రాజకీయ ప్రముఖులు, భక్తులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మధుమణి ఆసుపత్రి ఉచిత శస్త్ర చికిత్సల సేవలు ప్రశంసనీయం.!

**..ఏపీ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి ఫరూక్.**

**..37 వ ఉచిత శస్త్ర చికిత్సల శిబిర కరపత్రాలు విడుదల చేసిన మంత్రి ఫరూక్.**

**..జులై 20 నుండి 26 వ తేదీ వరకు వారం రోజులపాటు 50 లక్షల రూపాయల విలువ చేసే 100 శస్త్ర చికిత్సలు నిర్వహిస్తాం: డాక్టర్ మధుసూదనరావు.**

**..వారం రోజులు ఉచిత ఓపిడి సేవలు మరియు మందుల పంపిణీ: డాక్టర్ మణిదీప్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 11:**
మధుమణి ఆసుపత్రి ఆధ్వర్యంలో గత 36 సంవత్సరాలుగా ప్రతిఏటా నిర్వహిస్తున్న ఉచిత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సల ఉచిత వైద్య శిబిరం ఈ ఏడాది నిర్వహించే శిబిరం కరపత్రాలను రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మధుమణి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం జూలై 20 నుండి 26వ తేదీ వరకు వారం రోజులపాటు ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ నాగమణి,డాక్టర్ మణిదీప్ ఉచిత శస్త్ర చికిత్సల శిబిరం నిర్వహిస్తున్నారు. కరపత్రాల విడుదల సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం నిరుపేదలకు ఖరీదైన శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ మధుసూదనరావు సేవలు ఆదర్శనీయమని ప్రశంసించారు. నంద్యాల వైద్యులు అనేకమంది విస్తృత సేవలు అందించడం హర్షనీయమన్నారు.
ఆసుపత్రి నిర్వాహకులు ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్యులు డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ మణిదీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులలో 50 లక్షలు విలువచేసే 100 శస్త్ర చికిత్సలు నిరుపేదలకు ఉచితంగా చేస్తామని, వారం రోజులు ఉచిత ఓపిడి సేవలు మందులు కూడా ఉచితంగా అందజేస్తామని అన్నారు.
తమతో పాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఈఎన్టి వైద్యులు చెన్నైకి చెందిన డాక్టర్ కైలాస్ స్వామి, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి, బెంగళూరుకు చెందిన దీపక్ హల్దిపూర్, డాక్టర్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ మంజునాథ్,డాక్టర్ హర్షద్, విజయవాడకు చెందిన డాక్టర్ విద్యాసాగర్, కరీంనగర్ డాక్టర్ శ్రీపతి నాయుడు, హైదరాబాద్ కు చెందిన డాక్టర్ తేజస్వి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రోహిత్ శస్త్ర చికిత్సలు చేస్తారని, ఈ ఆపరేషన్లకు అవసరమైన అనస్తీసియా ప్రముఖ మత్తు మందు వైద్యులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మాధవి డాక్టర్ వంశీ సేవలందిస్తారని తెలిపారు. కేవలం నిరుపేదలు అయిన వారికి మాత్రమే చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ తో పాటు డాక్టర్ మధుసూదనరావు, కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు, డాక్టర్ మణిదీప్ ,తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, జయప్రకాశ్, బ్యాంకు తిమ్మయ్య పాల్గొన్నారు.

# పారదర్శకంగానే డీఎస్సీ నిర్వహణ

**పలుమార్లు వివరణ ఇచ్చాం**

**ఆన్‌లైన్‌లో వివరాలు పెట్టినా పదేపదే విమర్శలు**

**మరోమారు మీడియాతో కోనశశిధర్ వెల్లడి**



**అమరావతి,జూన్11ఆంధ్ర ప్రగతి**
డీఎస్సీపై రెండుసార్లు సమగ్ర వివరణ ఇచ్చినా నిరాధార ఆరోపణలే మళ్లీ మళ్లీ వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అక్టోబర్‌లో జాబ్ క్యాలెండర్‌లో భాగంగా మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ వస్తోందని చెప్పుకొచ్చారు. దీనిపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. గురువారం కోన శశిధర్ మీడియాతో మాట్లాడారు. లీక్‌కు ఎలాంటి స్కోప్ లేకుండా డీఎస్సీ నిర్వహించామని స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్ అర్థం చేసుకోని వాళ్లే అనవసర విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కాల్ లెటర్ వచ్చినంత మాత్రాన ఉద్యోగం వచ్చినట్లు కాదని నోటిఫికేషన్‌లోనే స్పష్టం చేశామని అన్నారు. సర్టిఫికేట్ ధ్రువీకరణ కోసమే కాల్ లెటర్‌లు పంపిస్తామని వివరించారు. ఎక్కడైనా సెలెక్షన్ లిస్ట్ ఉంటుంది తప్ప రిజెక్షన్ లిస్ట్ ఉండదని చెప్పుకొచ్చారు. ఇంకో డీఎస్సీ కూడా వస్తున్నందున అభ్యర్థులు ఈ విధానాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఇంకా అనుమానాలు ఉంటే కమిషనర్ కార్యాలయంలో సమాచారం కోసం అందుబాటులో ఫోన్‌నంబర్ ఉందని, అందరి అనుమానాలు నివృత్తి అవుతాయని కోన శశిధర్ పేర్కొన్నారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా విధానంపై ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఎస్సీలో క్రీడా కోటా పారదర్శకంగా అమలు చేశామనటానికి అన్నీ ఆన్‌లైన్‌లో ఉంచామని స్పష్టం చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పకడ్బందీగా డీఎస్సీ పరీక్ష నిర్వహించామని తేల్చిచెప్పారు. 2019లో ఇంటర్ కాలేజ్ రిక్రూట్‌మెంట్ జరిగిందని, కానీ ఇప్పుడలా చేయలేదని వివరించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్, స్టేట్, ఇంటర్నేషనల్, ఒలింపిక్స్ వరకు సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో చూశామని వెల్లడించారు. నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయని వారికి ఉద్యోగం రాలేదని అన్నారు. అలాంటి వారు కొందరు కోర్టుకు వెళ్లారని, కోర్టు ఇచ్చే ఆదేశాల ప్రకారం ప్రభుత్వం నడుచుకుంటుందని అజయ్ జైన్ స్పష్టం చేశారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలి.

## ..సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 11:**
బాలలను బడిలో చేర్పించకుంటే దేశం అంధకారానికి గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారని ఎవరైనా బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే 1098 చైల్డ్ లైన్ కేంద్రానికి సమాచారం అందించాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. బాలలలో ముఖ్యంగా అణచివేతలకు గురౌతున్నవారికి సామాజిక భద్రతలు కల్పించేందుకు కేంద్ర రాష్ట ప్రభుత్వాలు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నాయి.అందుకు పూర్తిస్థాయిలో సహకారం అందించాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది. బాల కార్మికుల దుస్థితిని వెలుగులోకి తెచ్చి , పిల్లలను బడి లో చేర్పించె ప్రయత్నమే జూన్ 12 న పాటించే ఈ అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ముఖ్య ఉద్దేశమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ప్రపంచంలోనే 14 ఏళ్ళలోపు వయసు వున్న బాలకార్మికులు అత్యధిక సంఖ్యలో మన దేశంలో వుంటున్నప్పటికీ ఈ బాల కార్మిక సమస్య భారత దేశానికే పరిమితంకాదు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో బాలలచే బలవంతంగా పనులు చేయిస్తున్నారు. 14 ఏళ్ళలోపు బాలలచే రోజుకు ఎక్కువ గంటలపాటు పనిచేయిస్తున్నారు. వారు పోషకాహారం లేక అనారోగ్యానికి గురిఅగుచున్నట్టు కొన్ని సర్వేల ద్వారా తెలుస్తుంది.బాల కార్మికులుగా వున్నారంటే బాలలకు వారి ప్రాథమిక హక్కు అయిన విద్యా హక్కును దూరం చేయ్యడమే. విద్య లేదంటే ఇది నైపుణ్యంలేని స్థాయిలో దారిద్ర్యానికి దారితీస్తుంది.గత కొన్నేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం దోపిడీకి గురౌతున్న బాలల అవసరాలను, హక్కులను పరిష్కరించేందుకు తన వంతు కృషిని ముమ్మరం చేసింది. అయినా కొన్ని ప్రాంతాల లో సమస్య తీవ్రత అలాగే వుంది. బలమైన చర్యలను తీసుకోవాలంటే ప్రజల సహకారం పూర్తి స్థాయి లో అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు. సంక్షోభంలో వున్న కుటుంబాలకు, బాలలకు దోహద పడేందుకు బాలలందరికీ విద్యావకాశాలను పెంపొందించాలి. అందుకే దేశం లోని స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రజా సంఘాలు


పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.

ప్రతి ఒక్కరు ఈ సమస్యపై పోరాడేందుకు ముందుకు రావాలనేదే నేటి బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవ ముఖ్య ఉద్యేశమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. వివిధ ప్రాంతాలలో పనిలో ఉన్న చిన్నారుల వివరాలను సంబంధింత అధికారులకు సమాచారం అందిస్తే వారికి మంచి భవిష్యత్తును అందించిన వారం అవుతాం. అందరూ సహకరిస్తే బాల కార్మికులు అనే వారు ఉండరు. బాలలు పనిచేస్తే ప్రతి ఒక్కరూ వెంటనే స్పందిస్తే ఎవరూ కూడా చిన్నారులను పనిలో పెట్టుకునేందుకు వీలు ఉండదు.బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు అందరూ సామాజికంగా తమ వంతు కృషి చెయ్యాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. తమ పిల్లలు కాకపోయినప్పటికీ పనిలో ఉన్న బాలలకు మంచి భవిష్యత్‌ను అందించేందుకు ప్రతి పౌరుడు స్పందించాలి. వివిధ ప్రాంతాలలో పనిలో ఉన్న చిన్నారుల వివరాలు ప్రభుత్వ ఉచిత కాల్ కుఫోన్ చేయ్యాలి 1098 .. ఒక్క ఫోన్‌తో ఎంతో మంది బాలలకు బంగారు భవిష్యత్తు ఇవ్వవచ్చని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పించి మంచి భవిష్యత్తును అందించేందుకు అందరూ సహకరించాల్సిన అవసరం ఎంతైన ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

## ..ప్రజలకు చేరువైన ప్రభుత్వ విజయాలను విస్తృతంగా చాటాలి. ..జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 11:**
రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులతో కార్యక్రమ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సాధించిన ప్రగతిని ప్రజలకు విస్తృతంగా తెలియజేయడమే లక్ష్యంగా జూన్ 12 నుంచి 23వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాస్థాయిలో జూన్ 17న నంద్యాల పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డులో భారీ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నందున, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసి




కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సుమారు 5,000 మంది లబ్ధిదారులు, మార్గదర్శులు, వివిధ వర్గాల ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, యువత, విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి విజయగాథలను కార్యక్రమంలో ప్రదర్శించడంతోపాటు ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగశక్తి, ఉద్యోగ మేళాల ద్వారా ఉపాధి పొందిన యువత, గృహ నిర్మాణ లబ్ధిదారులు, తదితర పథకాల లబ్ధిదారులలో ఉత్తమ వక్తలను ఎంపిక చేసి కార్యక్రమంలో మాట్లాడేలా సిద్ధం చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమగ్రంగా ప్రతిబింబించే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, పరిశ్రమలు, పల్లె పండుగ, స్వచ్ఛత, పర్యాటకం, మౌలిక సదుపాయాలు, హరితాభివృద్ధి తదితర రంగాలలో జిల్లాలో సాధించిన పురోగతిని గణాంకాలతో సహా ఆకర్షణీయంగా ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. టేక్కె ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ఎల్ఈడి స్క్రీన్లు, వైద్య శిబిరాలు, రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసే వేదికగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల సబ్ డివిజన్ లోని పలు పోలీస్ స్టేషన్ ల ఆకస్మిక తనిఖీ.

## ..ప్రజల రక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలి.

## ..శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేయండి.- ..జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 11:**
నంద్యాల జిల్లా సునీల్ షోరాణ్ గురువారం నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నంద్యాల టూ టౌన్, త్రీ టౌన్ , తాలూకా పోలీస్ స్టేషన్లు, పోలీస్ కంట్రోల్ రూమ్ మరియు గోస్పాడు పోలీస్ స్టేషన్లను ఆయన సందర్శించి పలు రికార్డులు పరిశీలించడంతో పాటు జరుగుతున్న విధులను క్షుణ్ణంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలోని స్టేషన్ డైరీ, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.
సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితి, రాత్రి వేళల్లో గస్తీ (పెట్రోలింగ్) నిర్వహణ, అసాంఘిక మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాలని, నేరాల నియంత్రణకు తీసుకోవలసిన







చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కంట్రోల్ రూమ్ పనితీరును పరిశీలించి, అత్యవసర సమయాల్లో స్పందించే వేగాన్ని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.సి సి కెమెరాల పనితీరు, 112 కాల్స్ పై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని ఆదేశించారు.
పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులపై నిబద్ధతతో పనిచేయాలని అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల రక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరించారు.ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీతో పాటు స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహానంది మండలంలో ఆగని ఎర్రమట్టి, గ్రావెల్ రవాణా..!

## ..అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మట్టి మాఫియా. -పొలాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు.





**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 11:**మహానంది మండలంలో ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగుతున్న కన్నెత్తి చూడని అధికారులు. గత కొద్ది రోజులుగా మండలంలోని గోపవరం గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ భూమి నుండి ఎర్రమట్టి తవ్వకాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఇటుకల బట్టి లకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు గ్రావెల్, ఎర్రమట్టి తరలిస్తూ రైతులను నాశనం చేస్తున్నారని స్థానిక రైతులు ఆగ్రహిస్తున్నారు. మండలంలో మట్టి మాఫియా పై మైనింగ్, రెవిన్యూ, రవాణా శాఖ ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోకపోవడంతో పలువురు రైతులు తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయనే నెపంతో పి జి ఆర్ ఎస్ ద్వారా జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారని పలువురు రైతులు చర్చించుకుంటున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఎర్రమట్టి అధికారుల కళ్ళముందే రవాణా జరుగుతున్న చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి రైతులను నష్టపరుస్తున్న మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాలని రైతులు విన్నవించుకుంటున్నారు.

# ధర్మవరంలో జరిగే 16వ అంతర్ జిల్లాల హాకీ పోటీలకు నంద్యాల జట్టు సిద్ధం.

## జాతీయ స్థాయిలో రాణించి నంద్యాల పేరును దశదిశలా చాటాలని క్రీడాకారులకు పిలుపు.

## క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్న చాణిక్య రాజు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 11:**
నంద్యాల జిల్లా హాకీ క్రీడాకారులు మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు సిద్ధమయ్యారు. ధర్మవరంలో రేపటి (జూన్ 12) నుండి ప్రారంభం కానున్న 16వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్స్ హాకీ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టుకు హాకీ నంద్యాల జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జెర్సీలను బహుకరించారు.జూన్ 12వ తేదీ నుండి 15వ



తేదీ వరకు ధర్మవరంలో ఈ ప్రతిష్టాత్మక హాకీ ఛాంపియన్షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు వెళు తున్న నంద్యాల జిల్లా క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్య రాజు, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు.
ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్య రాజు మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని, జీవితంలో క్రమశిక్షణను అలవరుస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. నంద్యాల జిల్లా హాకీ క్రీడాకారులు ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించి జిల్లా పేరును దశదిశలా చాటాలని ఆయన ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో హాకీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం రాజు, సెక్రెటరీ సునీల్ ముత్యం, జాయింట్ సెక్రెటరీ దివాకర్, ట్రెజరర్ స్టీఫెన్ మరియు టీం కోచ్ శ్రావణ్ కుమార్‌లతో పాటు వెటరన్ క్రీడాకారులు విల్సన్, కారు రవి కుమార్, రిచర్డ్, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేయాలి.

**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 11:**
డీలర్లు రైతులకు ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారానే ఎరువులు పంపిణీ చేయాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏవో మాట్లాడుతూ..డీలర్లు ఏపీఏఐఎంఎస్ యాప్లో అమ్మిన స్టాకు వివరాలు, ఈపాస్ మిషన్లో నమోదు చేసిన స్టాకు వివరాలు ఒకే విధంగా ఉండాలని, ఎటువంటి వ్యత్యాసాలు ఉండరాదని హెచ్చరించారు.రైతులు ఈ యాప్ ద్వారా మాత్రమే యూరియా మరియు డిఏపి ఎరువులు కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.రైతు వేసిన పంట, విస్తీర్ణం ఆధారంగా మూడు విడతల్లో దశలవారీగా రైతులకు



యాప్ ద్వారా ఎరువులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. డీలర్లు ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను స్టాక్ రికార్డులో నమోదు చేయాలని, ఎరువుల నియంత్రణ చట్టానికి లోబడి వ్యాపారం చేయాలన్నారు. ఏమైనా వ్యత్యాసాలు ఉంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.
ఖరీఫ్ 2025లో పంట నమోదు చేసిన రైతుల వివరాల ఆధారంగా యూరియా,డిఏపి ఎరువులు అందజేస్తామన్నారు.కొత్తగా సాగుదారులు ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని, తద్వారా యూరియా,డిఏపి ఎరువులు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అధికంగా యూరియా ఎరువులు వాడడం వల్ల భూసారం కోల్పోయి పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. పచ్చి రొట్ట పైరు అయ్యిన జీలుగను విరివిగా రైతులు సాగు చేయాలని, జీలుగ విత్తనాలు రైతు సేవా కేంద్రం నందు సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయని, రైతులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# నెహ్రూ రికార్డును బ్రేక్ చేసిన.. భారత ప్రధాని నరేంద్ర మోడీ.

## -చరిత్ర సృష్టించిన మోదీ.. అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా ఘనత.!

## - హర్షం వ్యక్తం చేసిన నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 11:**
భారత ప్రజాస్వామ్య చరిత్రలో జూన్ 10 ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న సుదీర్ఘకాలం ఎన్నికైన ప్రధాని రికార్డును (4,398 రోజులు) మోదీ అధిగమించి (4,399 రోజులు) సరికొత్త చరిత్ర సృష్టించారు.



**ప్రగతి రథసారథి మోదీ:**"2014 మే 26న ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ.. వరుసగా మూడు సార్లు ప్రజల అఖండ మెజారిటీతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. గత 12 ఏళ్లలో డిజిటల్ విప్లవం, జీఎస్టీ, మౌలిక సదుపాయాల కల్పన, అంతరిక్ష రంగంలో విజయాలు దేశ గమనాన్ని మార్చేశాయని అభిరుచి మధు పేర్కొన్నారు
**రికార్డుల రారాజు:**గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా కలిపి అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా కొనసాగిన నాయకుడిగా మోదీ ఇప్పటికే పలు రికార్డులను తిరగరాశారు. కాంగ్రెస్ ఆధిపత్యానికి గండి కొడుతూ, వరుసగా మూడు సార్లు బీజేపీని అధికారంలోకి తెచ్చిన మోదీ రాజకీయ ప్రస్థానం భారత ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అభిరుచి మధు కొనియాడారు. ఈ మైలురాయి పట్ల జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# వ్యవసాయానికి తోడుగా... రైతుకు అండగా...

# వ్యవసాయ మిత్ర..!

## ..సాగు ఖర్చులు తగ్గించి...దిగుబడులు పెంచి రైతును లాభాల బాట పట్టిస్తున్న అన్నదాత అసలైన మిత్రుడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 11:** వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. కోట్లాది కుటుంబాల జీవనాధారం. అయితే నేడు రైతాంగం ఎన్నో సవాళ్లతో పోరాడుతోంది. పెరుగుతున్న సాగు వ్యయాలు, నకిలీ వ్యవసాయ ఉత్పత్తుల బెడద, వాతావరణ మార్పులు, నేల సారం క్షీణత, కార్మికుల కొరత, తగ్గుతున్న దిగుబడులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో రైతుకు అండగా నిలుస్తూ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో అందిస్తూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే మార్గాలను చూపుతున్న సంస్థే 'వ్యవసాయ మిత్ర'. రైతు సమస్యలను అర్థం చేసుకుని వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు తెలుగు రాష్ట్రాల్లో వేలాది మంది రైతుల విశ్వాసాన్ని సంపాదించింది.

### రైతు సంక్షేమమే ధ్యేయం

వ్యవసాయ మిత్ర సంస్థ వెనుక ఉన్న ప్రధాన శక్తి మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్. వ్యవసాయం, సామాజిక శాస్త్రాల్లో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన, వ్యవసాయ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందించారు. అనేక మంది విద్యార్థుల్లో వ్యవసాయంపై ఆసక్తి పెంపొందించడమే కాకుండా వారిని వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. గత దశాబ్ద కాలంగా రైతులతో నేరుగా మమేకమై సాగు ఖర్చులు తగ్గించడం, రైతు ఆదాయాన్ని పెంచడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, ప్రకృతి సమతుల్యతను కాపాడడం వంటి అంశాలపై నిరంతరం కృషి చేస్తూ చిన్న వయసులోనే ఎన్నో సత్కారాలు, అవార్డులు పొందారు. రైతు సమస్యలను రైతు కోణంలో అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను సూచించడం ఆయన ప్రత్యేకత.

### రైతు పొలమే కార్యాలయం

వ్యవసాయ మిత్ర ప్రత్యేకత కార్యాలయాల్లో కాదు... రైతు పొలాల్లో కనిపిస్తుంది. సంస్థ ప్రతినిధులు నేరుగా రైతుల పొలాలను సందర్శించి పంట పరిస్థితులను పరిశీలిస్తారు. సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించి వాటి మూల కారణాలను గుర్తించి రైతులకు సరైన సమయంలో సరైన పరిష్కారాలను అందిస్తారు. వేరుకుళ్లు, పోషకాల లోపాలు, తెగుళ్లు, పండ్ల రాలుడు, ఎదుగుదల సమస్యలు, నేల ఆరోగ్య లోపాలు, దిగుబడి తగ్గుదల వంటి సమస్యలపై ప్రత్యక్ష మార్గనిర్దేశం చేస్తూ రైతుల నష్టాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

### నేల ఆరోగ్యమే రైతు భవిష్యత్తు

'భూమిలో జీవం ఉంటేనే రైతు జీవితంలో వెలుగు ఉంటుంది' అనే నమ్మకంతో వ్యవసాయ మిత్ర నేల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది.

అధిక రసాయనిక ఎరువుల వినియోగం వల్ల నేల సహజ సారం క్షీణించి, ఎరువుల వినియోగం పెరిగినా ఆశించిన దిగుబడులు రావడం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు సంస్థ రైతుల్లో అవగాహన కల్పిస్తూ కింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

- **జీవ ఎరువుల వినియోగం**
- **సేంద్రీయ పదార్థాల ప్రాముఖ్యత**
- **సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు**
- **నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం**
- **సూక్ష్మ పోషకాల నిర్వహణ**
- **నేలలో జీవసారం పెంపుదల**

దీని ఫలితంగా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల ఉత్పాదకత పెరిగి రైతులకు దీర్ఘకాలిక లాభాలు చేకూరుతున్నాయి.

### యువతకు స్ఫూర్తి... ఉపాధికి మార్గం

వ్యవసాయ మిత్ర రైతులకు మాత్రమే కాకుండా గ్రామీణ యువతకు కూడా మార్గదర్శకత్వం అందిస్తోంది. స్వయం ఉపాధి అవకాశాలు, అగ్రి స్టార్టప్‌లు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, విలువ ఆధారిత వ్యవసాయం, ఆధునిక సాంకేతికతలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది.



## "రైతు సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు చూపడం కాదు... శాశ్వత పరిష్కారాల దిశగా రైతును నడిపించడమే మా లక్ష్యం.

వ్యవసాయ మిత్ర మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ...

నేడు రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు పెరుగుతున్న సాగు ఖర్చులు, తగ్గుతున్న దిగుబడులు, క్షీణిస్తున్న నేల సారం. ఈ పరిస్థితిని మార్చాలంటే ముందుగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. భూమిలో జీవం ఉంటేనే రైతు జీవితంలో వెలుగు ఉంటుంది. అందుకే నేల ఆరోగ్య పరిరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, సమగ్ర పోషక యాజమాన్యం, జీవ ఉత్పత్తుల వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాం.

రైతు పొలంలో అడుగుపెట్టి, సమస్యలను దగ్గర నుంచి అర్థం చేసుకుని, రైతు ఆదాయం పెరిగేలా మార్గనిర్దేశం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం. రైతు విజయం సాధించినప్పుడే మా సేవలకు సార్థకత లభిస్తుంది. రైతు పొలంలో వెలిగే ప్రతి విజయ దీపం, రైతు కుటుంబంలో నిండే ప్రతి ఆనందం, రైతు ముఖంపై విరిసే ప్రతి చిరునవ్వు మాకు మరింత సేవా స్ఫూర్తిని అందిస్తాయి. రైతు సంక్షేమమే మా ప్రయాణం... రైతు విజయమే మా గమ్యం..

**రైతు విజయం... వ్యవసాయ మిత్రకు ప్రేరణ**
**రైతు సమస్యలను అర్థం చేసుకుని, శాస్త్రీయ పరిష్కారాలను క్షేత్రస్థాయిలో అందిస్తూ రైతు విజయాన్ని తన విజయంగా భావిస్తున్న సంస్థే వ్యవసాయ మిత్ర. సరైన సలహాలు, నేల ఆరోగ్య పరిరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, నిరంతర మార్గదర్శకత్వం ఉంటే రైతు జీవితంలో అద్భుత మార్పులు సాధ్యమని ఈ విజయగాథలు నిరూపిస్తున్నాయి.**



జి. అజయ్ కుమార్
మేనేజింగ్ డైరెక్టర్, వ్యవసాయ మిత్ర,6300927609

## మార్పుకు నిదర్శనాలైన కొంత మంది రైతుల విజయగాథలు

### "ఎదుగుదల సమస్యల నుంచి రికార్డు దిగుబడుల వరకు"

**రాంబాబు, పర్వేదుల - నల్గొండ జిల్లా**



"నాకు 4 ఎకరాల బత్తాయి తోట ఉంది. చెట్లు ఆశించిన విధంగా ఎదగక ఆందోళన చెందాను. వ్యవసాయ మిత్ర రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేసిన తర్వాత తోట పూర్తిగా ఆరోగ్యంగా మారి దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చింది. మార్కెట్లో మంచి రేటుకు పంటను అమ్ముకున్నాను."

### "తోటను తొలగించాలని అనుకున్న నేను... నేడు లాభాల్లో ఉన్నాను"

**రామాంజనేయులు, గార్లదిన్నె - అనంతపురం జిల్లా**



"నా ఆరేళ్ల బత్తాయి తోటలో వేరుకుళ్లు, బంక కారడం, పల్లాకు తెగులు సమస్యలు తీవ్రంగా ఉండేవి. ఎన్నో ఉత్పత్తులు వాడినా ఫలితం కనిపించలేదు. ఒక దశలో తోటనే తొలగించాలని నిర్ణయించుకున్నాను. వ్యవసాయ మిత్ర బృందం సమస్యలకు మూల కారణాలను గుర్తించి సరైన మార్గదర్శకత్వం అందించింది. కొంత కాలానికే తోట పూర్తిగా కోలుకుని ప్రస్తుతం మంచి దిగుబడులు ఇస్తోంది."

### "ఖర్చులు తగ్గాయి... లాభాలు పెరిగాయి"

**సుదర్శన్, తెట్టకుంట నల్గొండ**



"వరి సాగులో రసాయన మందులు, ఎరువుల వాడకం పెరిగి పెట్టుబడులు అధికమై నాకు లాభాలు తగ్గిపోయాయి. వ్యవసాయ మిత్ర సూచించిన నేల పరీక్షలు, సమతుల్య పోషకాల వినియోగం అమలు చేసిన తర్వాత పెట్టుబడి ఖర్చులు బాగా తగ్గి దిగుబడి పెరిగింది."

### "భారం అనుకున్న బత్తాయి... నాకు భరోసా అయింది"

**రఘునాథ్ రెడ్డి, పులివెందుల**



"నాకు 10 ఎకరాల బత్తాయి తోట ఉంది. తోట వయసు 8 సంవత్సరాలు. మొక్కలు ఎదుగుదల సరిగా లేకపోవడం, చనిపోవడం జరిగేది. పెట్టుబడి ఎంత పెట్టినా ఉపయోగం లేకుండా ఉండేది. నాకు భారంగా మారింది అనుకునే తరుణంలో వ్యవసాయ మిత్ర వారి సలహాలు, సూచనలు, సరైన ఉత్పత్తులతో నా తోట ఆరోగ్యం మెరుగుపడింది. దిగుబడులు పెరిగి నాకు ఆదాయం పెరిగింది."

### "నేల ఆరోగ్యం మెరుగై ఆదాయం పెరిగింది"

**రమేష్, గద్వాల**



"భూమిలో సారం తగ్గిపోవడంతో దిగుబడులు తగ్గాయి. జీవ ఉత్పత్తులు, సేంద్రీయ పదార్థాల వినియోగంపై వ్యవసాయ మిత్ర సూచనలు పాటించడంతో నేల ఆరోగ్యం మెరుగై ఆదాయం పెరిగింది."